# విశ్వనాథ కవిత్వం

- భైరవభట్ల కామేశ్వరరావు

## పద్యరచనా వైదుష్యం

విశ్వనాథ కన్నా అందంగా పద్యాన్ని రాయగల కవులున్నారు. అతనికన్నా మధురంగా రాయగలవారున్నారు. అతనికన్నా ప్రౌఢంగా రాయగల కవులూ ఉన్నారు. అతనికన్నా వాడిగా పద్యాన్ని నడిపించగలవారు కూడా ఉన్నారు. కాని యిన్ని రకాలుగానూ పద్యాన్ని నడిపించగల సమర్థులు మరొక్కరెవ్వరూ లేరు!

ఛందస్సు వేదపురుషుడి పాదాలంటారు. అంటే ఛందస్సు నడకనిస్తుందన్న మాట. వేదాలూ చాలావరకూ పూర్వ సంస్కృత కావ్యాలూ కూడా ఛందస్సుని నడకకి మాత్రమే ఉపయోగించుకున్నాయి. కావ్య కళ వృద్ధి చెందిన కొద్దీ, చెప్పే విషయానికి అనుగుణంగా ఛందస్సుని ఎన్నుకోవడం మొదలయ్యింది. దీనినే క్షేమేంద్రుడు వృత్తౌచిత్యం అన్నాడు. ఇక మన తెలుగు కవులు ఏంచేసేరయ్యా అంటే, యీ ఛందస్సుని కొన్ని కొన్ని చోట్ల కొన్ని ప్రత్యేక అంశాలని ధ్వనించడానికి ఉపయోగించుకున్నారు. అంటే ఛందస్సుకి నడకతో పాటు గొంతు కూడా ఇచ్చారన్నమాట! పద్యపు టెత్తుగడ, పద్య నడకలో వివిధ గతులు, యతి ప్రాసలని అతకడంలో ప్రత్యేకత – వీటన్నిటి ద్వారా చెప్పే విషయాన్ని ధ్వనింప చెయ్యడం పద్య శిల్పం. ఇలాటి పద్య శిల్ప నైపుణ్యంలో విశ్వనాథ అసామాన్యుడు. ఉదాహరణకి యీ పద్యం చూడండి. ఇందులో రావణుడు సీత దగ్గర తన గొప్పతనాన్ని చాటుకుంటున్నాడు:

ఓహో! మూడవవాని జూపుము సమస్తోర్వీభరంబున్ ఫణా
వ్యూహంబందు నటో యిటో యొరుగగా నూనంగ నైనట్టి శే
షాహిం దక్కగ వింశతి ప్రభుభుజాహంకార సంభార రే
ఖా హేలాధృత శైవ పర్వత భుజాస్కందున్ ననున్ దక్కగన్

“సమర్థమైన నా ఇరవై భుజాల శక్తీ ద్యోతకమయ్యేట్లుగా వట్టి ఆటగా కైలాసాన్నే ఎత్తిన వాడిని నేను. ఇంతటి కార్యాన్ని చేసినవాడు మరెవడున్నాడు? మహా చెప్పుకోవాలంటే ఆదిశేషుడున్నాడు. మొత్తం తన పడగలన్నిటితో అటో, ఇటో ఒరిగిపోయినట్టుగా భూమిని మోస్తున్నాడు. అతన్ని తప్ప, మరో మూడో వాడసలెవడైనా ఉన్నాడేమో చూపించు!” ఇదీ రావణుడి అహంకారం. ఇందులో శేషుడు చేస్తున్న పనిని వర్ణించే రెండవపాదాన్ని, రావణుని ఔద్ధత్యాన్ని వర్ణించే చివరి రెండు పాదాలతో పోల్చి చూడండి. “అటో యిటో యొరుగగా నూనంగ నైనట్టి” ఇది ఆగి ఆగి వెళుతున్న నడక. అది ఒక పక్క శేషువు పడుతున్న శ్రమని, మరో వంక రావణుడికి అతని మీదున్న తిరస్కార భావాన్ని ధ్వనిస్తోంది. అదే రావణుడి విషయంలో, పద్యం ఏక సమాసంలో ధారగా సాగి, ఒకవైపు కైలాసాన్ని ఎత్తడంలోని సునాయాసాన్ని, మరో పక్క రావుణుడి అహంకారాన్ని ధ్వనిస్తోంది. పద్యం ఎత్తుకోవడంతోనే, “ఓహో మూడవ వాని జూపుము” అనడం రావణుని సంభాషణా పటిమని పట్టిస్తోంది. ఇదీ పద్య శిల్పం.

విశ్వనాథ ఒక్కొక్క కావ్యంలోనూ ఒక్కొక్క రకమైన పద్య శైలి కనిపిస్తుంది. కిన్నెరసాని పాటల్లో కిన్నెర నడకలలో ఉన్న వైవిధ్యాన్ని గతిభేదంతో ఎంత సుందరంగా ఆవిష్కరించారో చదివిన వాళ్ళకి తెలిసిన విషయమే. కిన్నెరసాని పరుగులు పెడితే, పాటల గతి కూడా పరుగులు పెడుతుంది. కిన్నెర నింపాదిగా, వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళేటప్పుడు, పాట కూడా కదలలేక కదలలేక కదులుతుంది. ఇవన్నీ విశ్వనాథ సొంత గొంతులో వింటే మరింత అద్భుతంగా అనిపిస్తాయి!

పూర్వ కవులెవ్వరూ పెద్దగా పట్టించుకోని మధ్యాక్కర ఛందస్సుని తీసుకొని ఏకంగా పది శతకాలు (అంటే వెయ్యి పద్యాలకి పైగా!) రాయడమన్నది విశ్వనాథకి ఛందస్సు మీదున్న పట్టుని నిరూపిస్తుంది. అతి సామాన్యమైన తెలుగు సంభాషణలకి మధ్యాక్కర ఛందస్సు చాలా అనువైనదని అతను గుర్తించారు. దానికి తగ్గట్టు పద్యరచన చేసారు.

“కోరి కబేలాకు మందగా దోలికొనిపోవుచుండ,
దారి ప్రక్కనయున్న పచ్చిగడ్డిపై దారాడు పసుల
తీరుగానున్నది, జనుల భోగాశ! తెలివి సర్వమ్ము
చూఱ పుచ్చెదవు శ్రీశైల మల్లికార్జున! మహాలింగ!”

ఇలా సాగుతుంది మధ్యాక్కర నడక!

విశ్వనాథ కల్పవృక్షంలో వాడినన్ని ఛందస్సులు మరెవ్వరూ ఎక్కడా నాకు తెలిసి వాడలేదు. ఛందస్సు పేరుకీ అందులో చెప్పే విషయానికీ సంబంధం ఉంటే, ఒక చమత్కారం కలుగుతుంది. ఉదాహరణకి మేఘాన్ని వర్ణించడానికి “జలదము” అనే వృత్తం, లేడిని వర్ణించడానికి “హరిణి” అనే వృత్తం వాడడం. ఇలాటివి కల్పవృక్షంలో చాలా కనిపిస్తాయి. అయితే ఇలాంటి రచన ఒక చమత్కారాన్ని మాత్రమే ఇస్తుంది తప్ప, మరేమీ ధ్వనించదు. ఒకానొక విషయాన్ని ధ్వనించడానికి ఛందస్సుని వాడుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

ముక్కూచెవులు కోసేసినప్పుడు శూర్పణఖ కోపంతో బొబ్బలు పెడుతూ ఆకాశంలోకి ఎగిరిపోతుంది. అలా అలా ఎగిరిపోతున్న శూర్పణఖ మాటలు ఒక నాలుగు పద్యాలలో రచించారు. అందులో మొదటి పద్యం లాటీవిటమనే ఛందస్సు, రెండవది అసంబాధము, మూడవది హలముఖి, నాలుగవది వ్రీడ. మొదటి పద్యంలో పాదానికి యిరవయ్యొక్క అక్షరాలు. రెండవ దానిలో పధ్నాలుగు, మూడవ దానిలో తొమ్మిది, చివరి దానిలో నాలుగు అక్షరాలు. ఇలా పద్య పరిమాణం క్రమేపీ తగ్గుతూ పోతుంది.

ఇదొక విచిత్రమైన పద్యశిల్పం. ఇలాంటిది తెలుగు సాహిత్యంలో మరెక్కడా నాకు కనిపించలేదు! ఇది రెండు విషయాలని ధ్వనిస్తోంది. ఒకటి, శూర్పణఖ పెద్దగా అరవడం మొదలుపెట్టి, క్రమంగా అలిసిపోయి, చివరకి మెల్లిగా అరిచింది అని అనుకోవచ్చు. లేదూ దూరంగా వెళిపోతున్న ఆమె గొంతు కిందనున్న రామలక్షణులకి, సీతకి క్రమేపి తగ్గుతూ వినిపించిందనీ అనుకోవచ్చు. ఇలా ఛందస్సులో గొంతుని వినిపించడం ఇక్కడ విశేషం.

ఆసక్తి ఉన్నవాళ్ళు విశ్వనాథ పద్య రచనలో చూపించిన వైవిధ్యాన్ని, వైదుష్యాన్ని మరింత లోతుగా పరిశీలించవచ్చు.

చెళ్ళపిళ్ళ వారు చెప్పిన, “**నా మార్గమ్మును కాదు, శిష్యుడయినన్, నా తాత ముత్తాతలం దేమార్గమ్మును కాదు, వీని దెదియో ఈ మార్గ మట్లౌటచే సామాన్యుండనరాదు!**” అన్న మాటలు విశ్వనాథ పద్య రచనా శైలి విషయంలో అక్షరాలా నిజమనిపిస్తుంది.

**(మిగిలిన భాగాలు వచ్చే సంచికలలో)**